1969 దీపావళి కథలపోటీలో రెండవ బహుమతి రు.1600 పొందిన కథ



'ఆ పేపరు కూడా యిచ్చెయ్యండమ్మగారూ!' అన్నాడు పేపర్లు సంచిలో వేసుకుంటూ పేపర్లు కొనేవాడు.

పేపర్లోకి దీక్షగా చూస్తున్న కామేశ్వరమ్మ కామాటలు వినపళ్లేదు.

పేపర్లవాడు మళ్ళీ 'ఇచ్చెయ్యండమ్మగారూ!' అన్నాడు.

ఈ పేపర్లు కొనేవాడిచేత అరగంటనుంచీ కామేశ్వరమ్మ పేపర్లని సరిగా తూవేట్టు చేద్దామని చాలా తిప్పలు పడింది. కానీ అతడిదగ్గర ఏమాయవుందోగానీ కనీసం ఆరు కిలోలు తూగుతయ్యనుకున్న పేపర్లు మూడు కిలోలు మాత్రం తూగాయి. అవి మూడునెలల పైనుంచీవున్న దినపత్రికలు. ఆరు కిలోలకి పైనే వుంటయ్‌గానీ తక్కువ వుండవు. అప్పటికీ మొదట్లోనే చెప్పింది —

'నువ్వు ఒక్కొక్క పేపర్నొప్పున వేస్తూ తూచాలి. ఒక్కతడవ కట్ట కట్టి త్రాసులో వేసుకుని తర్వాత దభీమని సంచిలో వేసుకు చక్కా పోవటానికి వీల్లేదు' అని.

'సరే' నంటూ తూచటం మొదలు పెట్టినవాడు తను ఒక్కొక్క పేపరు వేస్తుంటే మెల్లగా సణగటం మొదలెట్టి తర్వాత పెద్దగా అరవటంకూడా సాగించాడు.

'నువ్వలా అరవకు; సరిగ్గా తూచటం నీ కిష్టంలేకపోతే వెళ్లిపో' అని పేపర్లు యివతలకు లాక్కుని తనూ కసిరింది అతగాణ్ణి.

అట్లా కసురుకున్నపుడు అరవటం మానేసి గొణుక్కుంటూ తూచాడేగానీ వెళ్లనుమాత్రం వెళ్లలేదు. ఇట్లా అరుస్తూ, గొణుక్కుంటూ ఆరుకిలోలు తూగుతయ్యనుకున్న పేపర్లని మూడుకిలోలకి దించాడు.

'అందుకే యీ పేపర్లని బజార్లో అమ్మమని చెపుతాను. ఆయనకి తీరిక కనుపిస్తేనా? ఉద్యోగానికి తోడు యిన్నేళ్లకి చదువుకోక యేదో చెయ్యనా అన్నట్టు చదువుకూడా మొదలెట్టారు' అంటూ విసుక్కుంది కామేశ్వరమ్మ.

ఆ పేపర్లలో పదిహేను రోజులనాడు యమ్మెస్సీ పరీక్షా ఫలితాలుపడ్డ పేపరుంది. ఆ పేపర్నితీసి యివతలగాపెట్టింది. పేపర్లన్నీ తూచటం అయినతర్వాత పేపర్లోకి చూడటం మొదలెట్టింది. పెన్నుతో క్రింద గీతగీచివున్న నంబరే గోపీది.

పరీక్షలు వ్రాసివచ్చిన రోజున 'ఫస్టుక్లాసు వస్తుందమ్మా! ఏరాంకు వస్తుందో చెప్పలేను' అన్నాడు చాలా వుత్సాహంగా.

గోపీ దగ్గర్నుంచి ఆమాట విన్న రోజున గానీ కామేశ్వరమ్మకు కంటినిండా నిద్ర పట్టలేదు. గోపీ పరీక్షలు యింకా నెల రోజు లున్నప్పటినుంచీ 'వీడు పేసవుతాడా?' అన్న దిగులు కామేశ్వరమ్మకు పట్టుకుంది. సరిగ్గా ఈ పరీక్షలకు దాదాపు నెలముందే కామేశ్వరమ్మ భర్త సూర్యనారాయణ డిపార్టుమెంటల్ కేండిడేటుగా ఆఫీసరు పరీక్షలకు వెళ్లాడు. చివరి పేపరు వ్రాసొచ్చిన సూర్యనారాయణ —

'అన్ని పేపర్లు బాగా రాశాను కామేశ్వరీ! ఈ యేడాదినుంచీ నువ్వొక ఆఫీసరు భార్యనని చెప్పుకోవచ్చు' అన్నాడు నవ్వుతూ.

ఆవాలు బాగుచేస్తున్న కామేశ్వరమ్మ త్వరగా లేచి పూజామందిరంలోకి వెళ్లింది.

'పిచ్చి కామేశ్వరీ!' అని అనుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు సూర్యనారాయణ.

పూజా మందిరంలో విగ్రహంముందు నమస్కరిస్తూ నిలబడ్డ కామేశ్వరమ్మలో అంతులేని భయాందోళనలు.

'నాకోసం నిన్నేమీ అడగను భగవాన్! గోపీని విద్యావంతుడిగా చేసే భారం నీదే' నంటూ నమస్కరించింది. చాలాసేపటికి బయటకు వచ్చిన భార్య ముఖంలో తనాశించిన వుత్సాహం, సంతోషం కనిపించ లేదు సూర్యనారాయణకు.

'ఏమిటలా వున్నావ్?' అన్నాడు సూర్యనారాయణ.

'అబ్బే!...ఎలా వున్నాను?! ... ఆఁ... యిప్పటికయినా ఆ చదవటం ఆపేసి మీ ఆరోగ్యంగురించి శ్రద్ధ తీసుకోండి' ఆవాల పళ్లెం చేతిలోకి తీసుకుంటూ అంది కామేశ్వరమ్మ.

'పిచ్చి కామేశ్వరీ! ఈ మాత్రానికే ఆరోగ్యం పాడవుతుందా?! అయినా చదవటం ఆపేస్తే ఎట్లా? వచ్చేయేడు ప్రయివేటుగా ఎం. ఏ. పరీక్ష కెడ్దామనుకుంటున్నాను' అన్నాడు సూర్యనారాయణ.

లోపలికి వెళ్లబోయే కామేశ్వరమ్మ ఆగింది.

'మీకేదో నిజంగానే పిచ్చిపట్టినట్టుంది. ఇప్పుడీ చదువు లెందుకండీ? ఉద్యోగం చేస్తూనే ఆ యల్లెల్బీ చదివారు. ఇప్పుడీ పరీక్షలకే చదివారు. మళ్లీ ఎం. ఏ. చదువుతారా! బాగుంది మీ వరస!! జీవితాంతం మీరు చదువుకుంటూనే గడుపుతారనుకుంటా చూడగా' అంది.

'అవును కామేశ్వరీ! ప్రతి మనిషి జీవితాంతం చదువుతూనే వుండాలి. చదువు అనే దొక అన్వేషణ. ఆ అన్వేషణకు అంతం అంటూ లేదు. సోక్రటీసు లాంటి వ్యక్తులు నిజమైన అన్వేషకులు. ఈనాటి మనుష్యులేముంది? డిగ్రీ తెచ్చుకోగానే చదవటం, నేర్చుకోవటం మానేసి చచ్చేవరకూ ఆ డిగ్రీగురించే చెప్పుకుంటూ బ్రతుకుతారు...అయినా నాతో పోలిస్తే వాళ్లంతా అదృష్టవంతులే. వాళ్లు డిగ్రీలన్నీ చిన్న వయసులో తెచ్చుకున్నారు. నేను ఈ వయస్సులోకూడా చదువుతున్నానన్న మాటే గానీ ఇంకా డిగ్రీకోసమే చదువుతున్నాను...'

'అందుకే డిగ్రీలకోసం మానేసి మామూలుగా చదువుకోండి. అప్పుడు యింత కష్టపడక్కర్లేదు...' అంది కామేశ్వరి.

సూర్యనారాయణ నవ్వాడు.

"అబ్బే. ముందీ ఏం. ఏ. డిగ్రీ రావాల్సిందే...నీకు తెలియదు కామేశ్వరీ ! నేను రేపు ఆఫీసర్నయినా ఎం.ఏ. డిగ్రీ రావాలి. ఎందుకో తెల్సా? ఈ రోజుల్లో క్లర్కు పోష్టుల్లోకూడా ఎం. ఏ. లుంటున్నారు. వాళ్లకంటె తక్కువ డిగ్రీ వున్న ఆఫీసర్ని గురించి వాళ్లేం చెప్పుకుంటారో తెల్సా?...'ఆఁ...వాడికేం చదువుందని ఆఫీసరయ్యాడోయ్ ? ఏదో లక్ తన్నింది; పైకెళ్లి పడ్డాడు' అని అంటారు. అందుకే నాకు ఎం. ఏ. చదవాలని వుంది. ...ఇంకో విషయం వుంది యిందులో. నీ కొడుక్కీ, నాకూ పోటీ. వాడీ యేడాది యెమ్మెస్సీ పూర్తి చేస్తే నేనింకో రెండేళ్లకన్నా ఎం. ఏ. పూర్తి చెయ్యొద్దూ ?' అంటూ నవ్వాడు సూర్యనారాయణ.

'ఏమిటి మీరంటుంది? మీకూ గోపీకి పోటీ ఏమిటండీ?...పోటీ...పోటీ అన్న మాట యింకెప్పుడూ అనకండి. పోటీ చేసేవాడు ప్రత్యర్థి పతనాన్ని కోరుతాడు. అంటే మీరుకూడా...'

'ఛీ ! అట్లా ఆలోచిస్తా వెందుకు? నేను నాకొడుకు పతనాన్ని కోరుతానా ? అయినా వాడు ప్రతి క్లాసులోనూ ఫస్టున వస్తున్నవాడు. ఎవరో యింకొకరు విధంగా కోరితే మాత్రం వాడు ఫస్టున రాక పోతాడా?...నే చెప్తున్నాగా...వాడు అమెరికా

స్వార్థంలో నిస్వార్థం

వెళ్లి డాక్టరేటు తప్పకుండా తెచ్చుకుంటాడు.'

'ఏమో !?...ఇంకెవరిదాకానో ఎందుకు? వాడి చదువు విషయంలో అవాంతరం మీ వల్లే కలుగుతుంది. ఈ విషయం నేనెప్పుడో చెప్పాను. మీరు విన్నారు కాదు' అంది కామేశ్వరమ్మ ఆవేశంగా.

సూర్యనారాయణ ఆశ్చర్యపోయాడు. తను యెంతో వుత్సాహంగా తను కడుతున్న పరీక్ష గురించి చెప్తుతున్నప్పు డెప్పుడూ కామేశ్వరి యెందు కిలా ప్రవర్తిస్తూందో సూర్యనారాయణ కెంత ఆలోచించినా అర్థం కాలేదు.

తను యల్లెల్బీ ఈవెనింగ్ కాలేజీలో చదివేటప్పుడు కూడా కామేశ్వరి అట్లాగే ప్రవర్తించేది. సాయంత్రం అయిదుగంటల వరకూ ఆఫీసులో పని చేసి తొందర తొందరగా తను కాలేజీకి వెడుతూ వుండేవాడు. వారానికి కనీసం రెండు మూడు సార్లయినా అనేది కామేశ్వరి—

'ఏమండీ...యిలా అయితే మీ ఆరోగ్యం పాడవుతుంది. ఎందుకొచ్చిన చదువు యిది? ఇప్పుడున్న వుద్యోగం, జీతం మనకు చాలకనా ఈ లేనిపోని బాధలు' అంటూ.

'ఇందులో బాధేముంది కామేశ్వరీ ! కొంచెం యిబ్బందిగా వున్నమాట నిజమే ననుకో. అయినా కష్టపడందే ఫలితం వస్తుందా ? గోపీ యూనివర్సిటీ కెళ్లేటప్పటికయినా నేను ఆఫీసర్ని కావొద్దూ ? ! ఈ 'లా' డిగ్రీకూడా వొస్తే యింకొంచెం ఎక్స్ట్రా క్వాలిఫికేషన్ వస్తుంది ... ఇక కష్టం సంగతి అంటావా? చిన్నతనంలో మా నాన్నగారు చదువు చెప్పించినప్పుడు శ్రద్ధగా చదువుకోనందుకు నాకీ శిక్ష కావాల్సిందే ... అన్నట్లు నా 'ఆరోగ్యం సంగతలా వుంచి నేనిలా ఆఫీసునుంచి కాలేజీకి తిరగటంతో యింటివిషయాలు సరిగా చూడక నీకేమన్నా యిబ్బంది కల్గిస్తున్నానా ?...'అనేవాడు.

'ఇబ్బంది సంగతలా వుంచండి. ముందు మీ ఆరోగ్యం ముఖ్యం...ఇబ్బంది వున్నమాట కూడా నిజమే ననుకోండి. సాయంకాలం మార్కెట్టుకి వెళ్లటంలాంటి పనులు గోపీ చెయ్యాల్సి వస్తోంది. వాడి చదువు పాడయిపోదూ ? వాడిపుడు కాలేజీలోకూడా చేరాడు. ఇవన్నీ ఆలోచిస్తే మీ రిప్పుడు యింత హైరానపడటం అనవసరం అని తోస్తోంది' అనేది.

గోపీ చదువు పాడయిపోతోందంటె సూర్యనారాయణకు బాధగానే వుండేది. కాని కామేశ్వరమ్మ అలా అన్నప్పుడే గోపీ అనేవాడు—

'నీకేం పిచ్చాఅమ్మా ! సాయంత్రం ఒక్కగంట మార్కెట్టుకి వెళ్లి వచ్చినంత మాత్రాన పాడయిపోతుందా చదువు ? నాన్నగారితో రోజూ యిలా మాట్లాడకు. మీ కెందుకు మీరు కాలేజీకి వెళ్లండి నాన్నగారూ ! ఈ విషయాలు నేను చూసుకోగలను' అని.

చిన్నవాడయినా గోపీకున్నపాటి వివేకం కామేశ్వరి కెందుకులేదో సూర్యనారాయణ కర్థంకాలేదు. ఆమె యిలా ప్రవర్తించటాని కేదో బలమైన కారణం వుండి వుండాలి. ఈ వయస్సులో తన భర్త చదువుకుంటున్నాడని చెప్పుకోటానికిసిగ్గా ? ఇందులో సిగ్గుపడాల్సిన విషయ మేమీలేదే? పైగా గర్వించాలిగాని...ఏమో ?... కామేశ్వరి మనస్సు తన కర్థం కాదు. గోపీ బజారుపనులు చేస్తానని ముందుకొచ్చినా గోపీని పంపేదికాదు. తనే వెళ్లి ఆ పనులు చూసుకొచ్చేది.



'అయితే గోపీచదువు పాడవుతుందనే కామేశ్వరిభయం కాబోలు' అనే నిర్ణయానికొచ్చేవాడు సూర్యనారాయణ.

కానీ ఆ నిర్ణయంకూడా యెంతోకాలం నిలిచేదికాదు. ఎందుచేతనంటే తను మార్కెట్టుకు వెళ్ళినప్పుడు తరచు గోపీని అడుక్కోమని పంపటమో లేదో అప్పుడప్పుడూ తనవెంట తీసుకు వెళ్ళటమో చేసేది కామేశ్వరమ్మ. వుద్దేశ్యమేమిటో సూర్యనారాయణ కర్థంకాలేదు.

ఒకనాడు సూర్యనారాయణ తలనొప్పిగావుండి కాలేజీనుండి త్వరగా యింటికి తిరిగి వస్తున్నాడు. మార్కెట్టుదగ్గర అనేకమంది మధ్యవయస్సు భార్యాభర్తలు కబుర్లు చెప్పుకుంటూ నడుస్తూ యేవేవిటో కొనుక్కుంటున్నారు. సూర్యనారాయణ, కామేశ్వరమ్మ కలిసి యిలా బయటకు రావటం యీమధ్య జరగలేదు. ఆరునెలల క్రితంవరకూ అంటే సూర్యనారాయణ యీ 'లా' కోర్సులో చేరక ముందు వరకూ యిలాగే సాయంత్రం మార్కెట్టుకు వస్తూవుండేవారు. పగలంతా ఆఫీసుపనితో విసిగిపోయిన సూర్యనారాయణకూ, యింటిపనితో సతమతమయిన కామేశ్వరమ్మకూ యిట్లా సాయంకాలం బయటకురావటం ఆహ్లాదన్నిచ్చేది. ఇప్పుడీ జంటల్ని చూస్తుంటె తను కామేశ్వరికేం లేకుండా చేస్తున్నాడో అర్థమయింది సూర్యనారాయణకి. అందుకే కామేశ్వరికి తన చదువుపట్ల అయిష్టత యేర్పడింది కాబోలనుకున్నాడు. వయస్సు పెరుగుతున్నా భార్యలాంటివి భర్త నుంచి ఆశిస్తూనే వుంటుంది. అది సహజం, కామేశ్వరమ్మ వుద్దేశ్యం అర్థమయిందనిపించింది సూర్యనారాయణకు. త్వరగా యింటికి చేరుకున్నాడు.

'నీ బాధ నా కర్థమయింది కామేశ్వరీ!' అన్నాడు నిద్ర కుపక్రమించేముందు.

'ఏమిటి ?' అంది కామేశ్వరమ్మ తమలపాకులకు సున్నం రాస్తూ.

'నేనీ చదువు మొదలుపెట్టడంతో మనం పూర్వంమాదిరి కబుర్లు చెప్పుకుంటూ తిరిగే అవకాశం కలగటంలేదు కదూ ?... కానీ యీ రెండేళ్ళూ నువ్వు కొంచెం వోపికపట్టు...తర్వాత మనం రోజూ షికార్లకి వెళ్ళొచ్చు.'

స్వార్థంలో నిస్వార్థం

'అయ్యోరాత !...ఎవరన్నారింటే నవ్వుతారు ! నా కిప్పుడు షికార్లు కావాల్సొచ్చిటండీ మిమ్మల్ని చదువు మానమందీ?'

'మరి ?...మార్కెట్టుకి గోపీని పంపకుండా నువ్వే వెడుతుంటివి. పోనీ వాడి చదువు పాడవుతుందని వాణ్ణి పంపించటం లేదా అంటె వాణ్ణేమో ఆటలకు పంపిస్తుంటివి...'

'అవునండీ...ఇప్పటినుంచే వాడినెత్తిన యీ బాధ్యతలన్నీ పెట్టమంటారా ? వాడికి సరదాగా సాయంత్రం ఆడుకోవాలనుండదూ ? ఆట్లా ఆడుకుంటేనే రాత్రికి చదివింది వాడితల కెక్కుతుంది. అందుకే వాణ్ణి పంపించటం లేదు.'

'మరి నన్ను చదువు మానమనటంలో నీ వుద్దేశ్యం...నాకు తెల్సులే...నీకు చెప్పటానికి సిగ్గుగా వుందికదూ? నేనివ్వాళ మార్కెట్టులో మన వయస్సు భార్యాభర్తలు సరదాగా తిరగటం చూశాను. మనం మాత్రం అలా తిరక్క యెందుకొచ్చిన చదువిప్పుడు అని నీ కనిపించటం సహజం...కానీ యీ రెండేళ్ళూ కొంచెం వోపికపట్టు...తర్వాత మనం కావల్సినే షికార్లు చెయ్యొచ్చు. ఏమంటావ్ !' అంటూ దగ్గరకు తీసుకున్నాడు.

సూర్యనారాయణ ముఖంలోకి చూసినవ్వి. గుండెలమీద తల ఆనిస్తూ 'నాబాధ మీ కర్థంకాదు' అంది అస్పష్టంగా కామేశ్వరమ్మ.

సూర్యనారాయణకి యల్సెల్బీ మొదటి సంవత్సరం పరీక్షలు దగ్గర కొస్తున్నయ్, గోపీకి కూడా ప్రీయూనివర్సిటీ పరీక్షలు యింకొక్క రెండునెల్లో వున్నయ్. ఇద్దరూ చాలా శ్రద్ధగా చదువుతున్నారు.

ఒకరోజున కాలేజినుంచి యింటి కొచ్చిన గోపీ 'తలకాయ నొప్పిగా వుందం'టూ పడుకున్నాడు మర్నాటికి జ్వరం వచ్చింది. రెండు మూడురోజులకు డాక్టర్ 'ఇది టైఫాయిడ్' అని తేల్చాడు. కామేశ్వరమ్మలో అంతవరకూ అనుమాన మాత్రంగా వున్న కొన్నివూహలు బలపడినయ్. 'ఇదంతా యిదిగో యీయన చదువువల్లే' అని నిర్ధారణ చేసుకుంది.

వినబడా భర్తతో కోపంగా మాట్లాడని కామేశ్వరి గోపీకి జ్వరం మొదలయినప్పటి నుంచి కోపంగానూ, ఆవేశంగానూ సూర్యనారాయణ దగ్గర మాట్లాడుతోంది. సూర్యనారాయణ కూడా చాలా విచారంగా వున్నాడు. అయినా అటు ఆఫీసు, కాలేజిల పని యిటు గోపీకి మందుల విషయాలు చూస్తూ సతమత మవుతున్నాడు.

పదిహేనురోజుల తర్వాత జ్వరం తగ్గుముఖం పట్టింది. కాని యింకా పదిహేను రోజుల వరకూ గోపీకి పూర్తి విశ్రాంతి యివ్వాలని డాక్టరు చెప్పాడు.

ఒకరోజున కాలేజీకి వెళ్ళబోతున్న సూర్యనారాయణతో అంది కామేశ్వరమ్మ—

'ఏమండీ!...వాడికి పరీక్షలు దగ్గర కొస్తున్నయ్. మీరు మీ చదువు సంగతి చూసుకోకపోతే. వాడి దగ్గర కూర్చుని వాడి పుస్తకాలు చదివి వినిపిస్తూ వుండకూడదూ ఈ సంవత్సరం పరీక్షలు సరిగా వ్రాయకపోతే చదువులో ఒక సంవత్సరం వెనక పడతాడు... ఇప్పుడు వాడి చదువు ముఖ్యమా, మీ చదువా?' అని.

ఈ మాటలు విన్న సూర్యనారాయణ ఆశ్చర్యపోయాడు. గోపీకి యీ పదిహేను రోజులు పూర్తి విశ్రాంతి యివ్వమన్నాడు డాక్టరు. అప్పుడే యీ పుస్తకాలు బలవంతంగా వాడి తలలోకి యెక్కించటం యిష్టంలేదు సూర్యనారాయణకి. అలా చేస్తే గోపీ త్వరగా కోలుకోలేడని సూర్యనారాయణ భయం. అదీగాక తన పరీక్షలు కూడా దగ్గరికొస్తున్నయ్. తనకి వయస్సు ముదరటంవల్ల వకటికి పదిసార్లు చదివితేగానీ యే విషయం గుర్తుకి వుండటంలేదు గోపీకి రెండుసార్లు చదివితే యే విషయమైనా యిట్టే గుర్తుకుంటుంది. తన చదువు విషయం వొదిలి వేసినా గోపీ ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా కామేశ్వరమ్మ చెప్పినట్లు సూర్యనారాయణ చెయ్య దల్చుకోలేదు.

తల్లిమాటలు విన్నగోపీ—

'అవును నాన్నగారూ!—మీరు చదువుతుంటె నేనర్థం చేసుకుని గుర్తుంచుకోగలను...నేనే చదువుదామంటె కాస్సేపు చదవంగానే కళ్ళు నొప్పులు పుడుతున్నయ్ తలనొప్పి వస్తోంది' అన్నాడు.

గోపీకి చదువు పాడయిపోతోందని

భయం. పరీక్షలు దగ్గర కొస్తున్నయ్యని ఆందోళన. అంతేగానీ యీ పదిహేను రోజులూ విశ్రాంతి తీసుకుంటె త్వరగా కోలుకోవచ్చన్న ధ్యాసే లేదు.

'ఫరవాలేదులేరా!...నీ కీ పదిహేను రోజులూ విశ్రాంతి ముఖ్యం. నీ పరీక్షల గురించేం దిగులు పెట్టుకోకు. పరీక్షల వేళ్టికి కోలుకుని బాగా రాస్తావు. ఒకవేళ బాగా రాయకపోయినా ఫరవాలేదు. వీట్ని గురించి ఆలోచిస్తూ మనస్సు పాడు చేసుకోకు' అన్నాడు సూర్యనారాయణ.

ఈ చివరి మాటలు గోపీకి ధైర్యాన్ని స్తొయ్యనే చెప్పాడు సూర్యనారాయణ. కానీ ఈ మాటల్లో కామేశ్వరమ్మకు విపరీతార్థం గోచరించింది. ఆమె ఆలోచనలు ఒకే మార్గంలో నడుస్తున్నయ్. ఆ మార్గం పూర్తిగా అర్థం లేని అనుమానాలతో నిండి వుందని ఆమెకు తెలియదు. ఆ అభిప్రాయాలే నిజం అని ఆమె నమ్మకం.

'అవును...వాడి చదువుకంటె ఇప్పుడు మీ చదువే ముఖ్యం... వాడికో సంవత్సరం పోతేమాత్రం ఏం పోయింది? మీ మాదిరి వయస్సు ముదిరిన తర్వాత చదువుకుంటాడు...నాకు తెల్సు...మీ కిప్పుడీ చదువు మీద ధ్యాస పూరికె కలగలేదు' అంటూ విసురుగా లోపలికి వెళ్ళింది కామేశ్వరమ్మ.

'ఎప్పుడూ "నా చదువో" అంటూ ఇంట్లో గోల. ఎవరయినా కొంచెం ప్రోత్సాహం యిస్తారు... ఈ యింట్లో అదీ లేదు. ఛీ...ఇప్పుడే పోయి మానేస్తున్నానని ప్రిన్సిపాల్తో చెప్పి వస్తాను'— అంటూ విసుక్కుంటూ బయటకువెళ్ళాడు సూర్యనారాయణ. బయటకు వెడుతున్న భర్త వంక లోపల్నుంచి చూస్తూ అనుకుంది కామేశ్వరమ్మ—

'క్షమించండి...మిమ్మల్ని విసిగించాను ...కానీ...కానీ నా బాధ మీ కర్థం కాదు' అని.

బయటకు వెళ్ళిన సూర్యనారాయణ కాలేజీకి వెళ్ళలేదు. ఆ నేట్టికి మాత్రం కాలేజీ మానేశాడు. పార్కులో కూర్చుని రాత్రి యెనిమిదింటికి యింటికి తిరిగొచ్చాడు.

'నాన్నగారూ? మీరు నిజంగా కాలేజీ పొంతం మానేశారా?' అన్నాడు గోపీ.

'లేదురా' అంటూ గోపీ మంచం మీద కూర్చున్నాడు సూర్యనారాయణ. తండ్రి కాలేజీ మానలేదని తెలిసి గోపీ సంతోషించాడు. కామేశ్వరమ్మలో ఈ సమాధానం యెలాంటి భావాన్నీ కల్గించలేదు. ఆమె మనస్సంతా గోపీ భవిష్యత్తు మీదే లగ్నం అయింది. గోపీ చదువు పూర్తయే వరకూ ఆమె అనుమానాలు ఆమెకుంటూనే వుంటయ్. ఈ సమస్య కిప్పటిలో పరిష్కారం లేదు. సూర్యనారాయణ చదువు మానేస్తే ఆమెకి మనశ్శాంతి లభిస్తుంది. కానీ అలా తను సూటిగా భర్తతో చెప్పలేదు.

*　　　*　　　*

కామేశ్వరమ్మ గోపీ నంబరు వంకే చూస్తూ కూర్చుంది.

'ఆ పేపరు కూడా యిచ్చెయ్యండమ్మగారూ!' అన్నాడు పేపర్లు కొనే అతను మళ్ళీ.

ఇక్కడ చేసిన బేరంలో యేదో నష్టం వచ్చినట్టు, కనీసం యీ పేపరన్నా యిస్తేగానీ లాభం లేదన్నట్టు మాట్లాడుతున్నాడతను.

కామేశ్వరమ్మ మాట్లాడక పోవటం చూసి—

'ఇంకేమన్నా పేపర్లున్నయ్యాండీ!... వారపత్రికలుగానీ, యింకేవన్నా పుస్తకాలుగానీ' అన్నాడు.

గోపీ నంబరు చూస్తున్న కామేశ్వరమ్మ యిలా అనుకుంది.

'నేను చెప్పినట్టు ఆయన ఆ చదువు మానేస్తే గోపీ నంబర్ని యీ స్థితిలో చూడవలసి వచ్చేదికాదు. ఇంతకీ వాడి భవిష్యత్తు యెట్లావుందో.'

*　　　*　　　*

గోపీ యెమ్మెస్సీ చివరి సంవత్సరంలోకి వచ్చాడు. ఆ సంవత్సరమే సూర్యనారాయణ ఆఫీసరు పరీక్షలకు వెళ్ళాడు. అప్పటినుంచే కామేశ్వరమ్మకు గోపీ చదువుగురించి దిగులు పట్టుకుంది. పరీక్షలు బాగా వ్రాశాచ్చానని సూర్యనారాయణ చెప్పిన దగ్గర్నుంచి ఆ దిగులు మరింత హెచ్చింది. గోపీ పరీక్షలు వ్రాసొచ్చి 'బాగారాశాను...' అని చెప్పినపుడుగానీ ఆమె ఆదుర్దా తగ్గలేదు.

గోపీ పరీక్షాఫలితాలొచ్చినయ్. గోపీ నంబరు ఫలితం తర్వాత ప్రకటించనున్నట్లు ప్రకటించారు. ఆఫీసరు పోస్టుకు సూర్యనారాయణను, సెలెక్టు చేసినట్లు అంతకు నాలంరోజుల క్రిందట తెలిసింది, దానికీ, గోపీ పరీక్షా ఫలితాలకీ పూర్తిగా సంబంధం, వున్నదని కామేశ్వరమ్మ విశ్వాసం.

పరీక్షాఫలితాలు ప్రకటించిన వారం రోజులకు గోపీ యూనివర్సిటీకి వెళ్ళాడు. వెళ్ళేముందు కామేశ్వరమ్మతో అన్నాడు.

'నువ్వేం ఆందోళన పడకమ్మా!... ఏదో సర్టిఫికెట్టు సబ్మిట్ చెయ్య

లేదేమో...అది చేశాక ఫలితం ప్రకటిస్తారు. అంతే నే వెళ్లి కనుక్కొస్తాను.'

అంతే అయ్యుంటుందా అని కామేశ్వరమ్మ అనుమానం...ఒకవేళ అంతే అయినా ఏక్లాసు వస్తుందో? కామేశ్వరమ్మకు ధైర్యం చాలటంలేదు.

*　　　*　　　*

'ఆ పేపరుకూడా యిచ్చెయ్యండమ్మగారూ !' అన్నాడు పేపరు కొనే అతను మళ్లీ.

అతను త్రాసు సంచిలో వేసుకుంటూండగా అయిన శబ్దంతో కామేశ్వరమ్మ యీ లోకంలో కొచ్చింది.

'ఈ పేపరు యివ్వనులే...యిది కావాలి' అంది.

పేపర్లతను డబ్బుయిచ్చి వెళ్లిపోయాడు.

*　　　*　　　*

రెండునెలల తర్వాత —

సూర్యనారాయణ తన ముఖ్య స్నేహితులను పదిమందిని పార్టీకి పిల్చాడు. తను ఆఫీసరయిన సందర్భాన్ని, గోపీకి అమెరికన్ యూనివర్సిటీలో పి. హెచ్. డి. చేసేందుకు స్కాలర్‌షిప్పు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని యేర్పాటు చేసిన పార్టీ అది. కాస్సేపు ఆ స్నేహితులు తండ్రిని, కొడుకునీ అభినందిస్తూ మాట్లాడారు. వాళ్లకు ఫలహారాలు అందిస్తున్న కామేశ్వరమ్మకు వాళ్లు చెప్పినవన్నీ సావధానంగా వినే అవకాశం లేకపోయింది.

కాఫీ కలిపియిచ్చిన తర్వాత తీరికగా

స్వార్థంలో నిస్వార్థం

ప్రక్కగదిలో కూర్చుని వాళ్ల సంభాషణ వినసాగింది ... స్నేహితులందరూ మాట్లాడిన తర్వాత సూర్యనారాయణ అన్నాడు —

'ఈ ఆఫీసరు పోస్టు నాకు రావటానికి కారణం మా కామేశ్వరి. అందుకని ఈ అభినందనలన్నీ నిజంగా ఆమెకే చెందాలి. కామేశ్వరి చేసిన పూజలవల్లే నేను ఈ వయస్సులో చదివి పరీక్షలు పేసవ్వగలిగాను ...'

ప్రక్కగదిలో కూర్చున్న కామేశ్వరమ్మకు ఆపై మాటలు వినబడలేదు. ఆమెలో అశాంతి చెలరేగింది.

'నేను నిజంగా వారి అభివృద్ధికోసం పూజలు చేశానా ? కనీసం మనసారా దేవుణ్ని ప్రార్థించానా?' అన్న ప్రశ్నలు వేసుకుని ఆమె నిలువెల్లా వణకిపోయింది.

ఏ భార్యఅయినా భర్త అభివృద్ధికోసం అలా చేస్తుంది. కానీ తను అలా ప్రవర్తించలేదు. పైగా భర్త తననిగురించి చాలా వున్నతంగా ఆలోచిస్తున్నాడు. తన భర్త అభివృద్ధిపట్ల తనకు ఆకాంక్ష లేదా ? కానీ ఆకాంక్షకన్నా బలమైనదేదో తనని యింకోవిధంగా ప్రవర్తించేట్లు చేసింది. అదే గోపీ ,చదువుగురించి ఆదుర్దా. తన అనుమానాల్లో అర్థం వుందో లేదో కామేశ్వరమ్మకు తెలియదు. అందుకే ఈ నాడు అనుకుంటోంది —

'ఆనాడు రంగమ్మపిన్నిగారు ఆ మాటలు చెప్పివుండాల్సింది కాదు. అలా జరిగివుంటే ఈ నాడు వారు చెపుతున్నట్లు వారి అభివృద్ధికోసం మనసారా దైవాన్ని ప్రార్థించి వుండేదాన్ని. త్రాడే పాము అన్న అనుమానంతో ప్రవర్తించానేమో. అందుకే అంత జాగ్రత్త వహించాను. ఆ జాగ్రత్తలో వారు సాధించిన విజయాల్లో సంతోషంగా పాల్గొనలేక పోయాను.'

*　　　*　　　*

గోపీ యస్సెల్సీ పరీక్షల్లో మార్కులు ఫస్టొచ్చినట్టు తెలిసిన రోజది. ఆ సాయంత్రం రంగమ్మ పిన్నిగారొచ్చింది. ఆవిడ మనవడు మూడేళ్లనుంచీ యస్సెల్సీ తప్పుతున్నాడు. అవీ యివీ మాట్లాడుతూ రంగమ్మగారంది.

'మీవాడు ఫస్టున పేసవకేమవుతాడమ్మా కామేశ్వరమ్మా! మీ మామగారి పోలికలే వచ్చినయ్. మీ అత్తవారివేపు వాళ్లలో తాతగారి బుద్ధులు, ప్రజ్ఞ మనవడికి రావటం ఆనవాయితీ...మీ మామగారు జడ్జీ చేసిరి. మీ గోపీ కూడా జడ్జి అయి తీరుతాడు. మీ ఆయన మాత్రం ఆ బి. ఏ తప్పటం చేతకాక, తెలివి తక్కువయి తప్పేదా యేం? అదీ ఆనవాయతీ ప్రకారం వచ్చిందే...మీ మామగారు జడ్జి అయినా ఆయన తండ్రికి చదువేం వంట పట్టలేదు. ఆయన పోలికే మీ ఆయన కొచ్చింది. లేకపోతే మీ ఆయనకి తెలివితేటలు లేకనా? ఆనవాయితీ అంతేనమ్మా! దాన్నిగురించి నాకు బాగా తెల్సు, ఇలా జరగటం మా వంశంలోనూ వుంది. ఇంకోటి కూడా వుంది దీంట్లో. ఈ ఆనవాయతీ ఒక తరం వాళ్లకి తప్పిందా అంటె తర్వాత తరంవాళ్లకి పట్టుకోక తప్పదు. మా మనవడు అందుకేగా తప్పుతోంది. మా వంశంలోనూ తాతగారి పోలికలు మనవడికి రావటం ఆనవాయతీ. తాతగారి పోలికవస్తే మా మనవడు ఇంజనీరు కావాలి. కానీ వాడింకా మార్కులు ఫైనలే గట్టెక్కటం లేదు. వాడుమాత్రం యేం చేస్తాడు? అనవాయతీ ప్రకారం వాళ్లనాన్నకి చదువు రావాల్సింది కాదు. కానీ వాడు ఆఫీసరవ్వటంతో వాడికి రావాల్సిన వారసత్వం వీడికొచ్చింది. అంతే దీనికి మనమేం చెయ్యలేం. ఇప్పటివాళ్ల





వీటిని తీసిపారేస్తారుగానీ యివి చాలా జాగ్రత్తగా సంక్రమిస్తూనే వుంటయ్'

ఈ అనవాయతీ 'థీసిస్' చెప్పటంలో రంగమ్మగారి ముఖ్యోద్దేశ్యం తన మనవడు యస్సెల్సీ తప్పటం తెలివి తేటలు లేక కాదని నమ్మించడానికే అయినా కామేశ్వరమ్మకీ మాటలమీద నమ్మకం యేర్పడింది. కాకతాళీయంగా జరిగిన కొన్ని సంఘటనలు ఆమె అనుమానాన్నే బలపర్చినయ్. అందుకే సూర్యనారాయణ చదువు విషయంలో మనస్ఫూర్తిగా యేకీభవించ లేకపోయింది. సూర్యనారాయణ చదువూ—గోపీ చదువూ—యీ రెండింటికీ పొసగదనే భావం బలంగా వ్రేళ్ళు పాతుకు పోయింది.

*　　　*　　　*

పార్టీకి వచ్చిన స్నేహితులు వెళ్ళిపోయారు. గోపీ కూడా ఎవరో స్నేహితుణ్ణి కల్సుకోవాలని బయటకు వెళ్ళాడు. సూర్యనారాయణ లోపలికి వచ్చాడు. కామేశ్వరమ్మ కూర్చుని వున్న గదిలో చీకటిగా వుంది.

'లైటు వెయ్యలేదేం కామేశ్వరీ' అంటూ స్విచ్ వేశాడు సూర్యనారాయణ. నీళ్ళు నిండిన కళ్ళతో భర్తవంక చూసింది కామేశ్వరమ్మ.

'ఏమయింది కామేశ్వరీ!' అంటూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

'మీరిందాక మీ స్నేహితులతో నన్ను గురించి చాలా గొప్పగా చెప్పారు ఆ ప్రశంశకు నేను తగను. అనుమానాలతో మీ అభివృద్ధి కోసం నేనేమీ చెయ్యలేదు. దౌర్భాగ్యురాల్ని' అంటూ తన అనుమానం గురించి అంతా చెప్పింది కామేశ్వరమ్మ.

అంతా విన్న సూర్యనారాయణ ఆశ్చర్యపోయాడు భార్య వంకే చూస్తూ నిలబడ్డాడు. అతని మనోఫలకంలో చిత్రించుకున్న కామేశ్వరమ్మ రూపం అవధులు లేకుండా పెరిగిపోతోంది.

'ఏమిటలా చూస్తున్నారు? నా అజ్ఞానానికి నేనంటే మీకు అసహ్యం కలగటం లేదూ?' అంది బాధగా కామేశ్వరమ్మ

కామేశ్వరమ్మను నిమురుతూ—

'లేదు కామేశ్వరీ! నిన్ను నేనిప్పుడు అమితంగా ప్రేమిస్తున్నాను. నువ్వంటే నాకిప్పుడు యెనలేని గౌరవం. స్త్రీ త్యాగానికి మారుపేరు. తనకు స్వతహాగా వివిధ రంగాల్లో రాణించగల శక్తి వున్నా వాటి వన్నిటినీ మరుగుపర్చుకుని యింటికే తన మనస్సుని కేంద్రీకరింపచేసి తనపై ఆధారపడినవాళ్ళ—ముఖ్యంగా భర్త యొక్క అభివృద్ధికోసం పాటుపడుతుంది. అందుకే—ఈ ప్రపంచంలో వృద్ధిలోకి వచ్చిన ప్రతి పురుషుని వెనక స్త్రీ తప్పక వుంటుంది. కానీ భర్తకోసం చేసే త్యాగంలో కొంచెం స్వార్థం వుండొచ్చు...' అంటున్న సూర్యనారాయణతో అంది కామేశ్వరి.

'నేనిప్పుడు చేసిన దాంట్లో మాత్రం స్వార్థం లేదూ? నా కొడుకు భవిష్యత్తు గురించే తప్ప మిగతా విషయాల గురించి ఆలోచించనే లేదు'

'అది స్వార్థం కాదు కామేశ్వరీ! ఈ ప్రపంచంలో స్త్రీ తన స్వంతం అనుకోగల్గింది భర్తేగానీ మరెవ్వరూ కాదు. నడుస్తున్న చరిత్ర మనకీ సంగతే చెప్తుంది. అయినా నువ్వు నీ స్వార్థం చూసుకోకుండా వ్యవహరించావు. పైగా అదే స్వార్థం అనుకుంటున్నావు. అదే నీ నిస్వార్థబుద్ధికి తార్కాణం. ఈ విధమైన నిస్వార్థం ఒక్క తల్లిలోనే వుంటుంది. అందుకే మాతృమూర్తిగా స్త్రీకో ప్రత్యేక స్థానం వుంది.'

'ఇక పోతే నువ్వు నా అభివృద్ధిని కాంక్షించకపోవటం నన్ను ప్రత్యేకదృష్టితో చూడటం వల్ల కాదు. నువ్వు చేసే త్యాగంలో నాకూ పాలుపంచాలని మాశావు. 'నువ్వూ—నేనూ' ఒక్కటే నన్న భావం నీలో వుండబట్టే అలా చెయ్యగలిగావ్... ఇంతకన్నా భార్యా భర్తల మధ్య కావాల్సిందేముంది?' అంటున్న భర్త పాదాలపై వ్రాలింది కామేశ్వరమ్మ.

'ఇంతటి త్యాగమయికా యింత కాలం మనశ్శాంతి లేకుండా చేశాను' అన్నభావం సూర్యనారాయణలో కదిలింది.

పాదాల చెంతనున్న భార్యను లేవదీసి హృదయానికి హత్తుకుంటూ అన్నాడు సూర్యనారాయణ:

'గోపీ డాక్టరేటు తీసుకుని వచ్చాకే నేను ఎం. ఏ. కు కడతాను కామేశ్వరీ! వాడే నాకు పాఠాలు చెప్తాడు కదూ?'

కామేశ్వరమ్మ కళ్ళల్లో వింత వెలుగు కనిపించింది. ఆమెలో అజ్ఞానం వుండొచ్చు. కాని ఆమె త్యాగానికి మారుపేరు నిస్వార్థానికి నిలయం. ఆమెలోని మాతృమూర్తికి జోహారు అర్పించాడు సూర్యనారాయణ ఎదురుగావున్న దేవుని పటం వైపు అరమోడ్చిన కనులతో చూస్తూ అనుకున్నాడు సూర్యనారాయణ:

'భగవాన్!...నీ సృష్టిలోకెల్లా అత్యున్నత మయింది మాతృహృదయం. అందుకేనేమో నీకింత గొప్పతనం. నీగొప్పతనాన్ని శాశ్వతంచేసే ఆ మాతృహృదయమే యీ ప్రపంచానికి శ్రీరామరక్ష.' ●